# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నౌకా నిర్మాణానికి దేశం కేంద్రంగా మారనుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు జిల్లాలోని మాచర్లకు చేరుకున్నారు.**
3. **ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండే విధంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**
4. **వ్యర్థాల నుంచి సంపద సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.**

============================

నౌకా నిర్మాణానికి దేశం కేంద్రంగా మారనుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మారిటైమ్ రంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగా ఈ రంగం మరింత అభివృద్ధి చెందడంతోపాటు అనేక ఉద్యోగాలు లభిస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని భావ్ నగర్‌లో 34 వేల 200 కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి ఈ రోజు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్...30 సెకన్లు

---------------------------

పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు జిల్లాలోని మాచర్లకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం కానున్నారు. అదేవిధంగా స్వచ్ఛరథాలను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండు కోట్ల రూపాయల చెక్కుల పంపిణీ చేయనున్నారు. అనంతరం ప్రజావేదిక బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

---------------------------

ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండే విధంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. శాసన సభలోని తన ఛాంబర్‌లో ఈ అంశంపై పంచాయతీరాజ్, ఆర్థిక, న్యాయ, సాధారణ పరిపాలన శాఖల ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. పంచాయతీల ఆదాయంతో నిమిత్తం లేకుండా జనాభా, ఇతర మరికొన్ని అంశాల ఆధారంగా 4 గ్రేడ్లుగా విభజించనున్నట్లు తెలిపారు.

----------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది.. పునరుత్పాదాక ఇంధన శక్తి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

..వాయిస్ ఓవర్

----------------------------

వ్యర్థాల నుంచి సంపద సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా టంగుటూరులో ఈరోజు నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్ సంచులను విడనాడి, చేతి సంచులు వినియోగించాలని సూచించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి తెలిపారు.

----------------------------

వస్తు సేవల పన్ను – జిఎస్టీ సంస్కరణల్లో భాగంగా కొన్ని వస్తువలపై జిఎస్టీని సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యాపారి సింహాద్రి లక్ష్మణ గుప్తా ఈ అంశంపై ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్.. 18 సెకన్లు)

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

----------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన "చలో జీతే హై" లఘు చిత్రాన్ని విశాఖ నగరంలోని పలు థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభమై ఈ నెల 24 వరకు ప్రదర్శించనున్న ఈ లఘు చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని వీక్షించిన జగదీశ్వరి ఆకాశవాణితో మాట్లాడుతూ..

..వాయిస్..25 సెకన్లు

----------------------------

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని నాన్ కమ్యూనబుల్ డిసీజెస్ – ఎన్సీడి ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు కోరారు. పార్వతీపురం జిల్లా గుమడలో నిన్న నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపి ఎన్సీడీ 4.0 యాప్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

-----------------------------

మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేశారు.

======================